''వస్తానమ్మా!...'' జోళ్ళు వేసుకుంటూ అంటున్న మాధవి వెనకే వచ్చింది జగదాంబ.

పసుపు రంగు ఆర్గండీ చీర, అదే రంగు జాకెట్,
బారెడు జడలో కొద్దిగా చేమంతులు... 'నిండుగా పెళ్లికూతురిలా వుంది మాధవి' అని అనుకోకుండా వుండలేకపోయిందావిడ. చకచక మేడ మెట్లు దిగుతున్న మాధవికి ఆటుగా వస్తున్న




మాధవ్‌ను చూడగానే గుండె ఝల్లుమంది. చిన్నగా నవ్వి కళ్లతో సంభాషించి ముందుకు సాగిపోయాడు మాధవ్.

అప్పటిదాకా వున్న హుషారు మాయమైంది మాధవికి. అసలు అతన్ని చూడగానే తను ఎందుకంత పిచ్చిదై పోయింది. మాధవికి మాధవ్ అంటే చాలా యిష్టం—అతనకీ అంతే. స్నేహితుల పుణ్యమా అని వీధిలో వాళ్ళకు కూడా తెలిసింది. ఆస్తి, అంతస్తులు అడ్డుగోడ కాకపోయినా మాధవి నాన్నగారు ఒప్పు కోవటం లేదు. అతను పెద్ద ఆఫీసర్. ఆ హోదా చూపించటమేగాక, కూతురు తన మాట వినలేదన్న కోపం... ''ఏంటో పాపం—యిద్దరు చూడ్డానికి ముచ్చటగా వుంటారు. పెళ్ళయితే వాళ్ళకు సంతోషం- కాని...'' అంటూ రాగాలు తీస్తున్న ఇరుగు పొరుగులతో మాటలు—జగదాంబ ఎటూ చెప్పలేక సతమతమవుతూంది.

అసలు వాళ్ళ పరిచయం చిత్రంగా జరిగింది. రిజల్ట్సు వచ్చి పాసయిన సందర్భంగా ఓ ఆదివారం మాధవి బృందం సినిమా ప్రోగ్రాం వేసుకున్నారు. జనం విపరీతంగా వున్నారు. మాధవ్ వాళ్ళు కూడా సినిమాకు వచ్చి టిక్కెట్లకి లేడీస్ ఫస్ట్ అని తెలుసుకుని తమకి టిక్కెట్లు తెమ్మని అడిగారు.

''ఆ ... యిలా తెచ్చియమని అడగటం, మాటలు పెంచటం ఫ్యాషనయిందీ మధ్య... లతా తీసీయకు...'' అని విసురుగా అంటున్న మాధవిని చూసి మాధవ్‌కు ఒళ్ళు మండింది.

''ఎవరికైనా అవసరమనేది వుంటుందండీ!... పరిస్థితి గమనించాలి...'' అన్నాడు.

''మీతో మాకేం అవసరంలేదు...'' అందరికి వినబడినట్లుంది. చాలా మంది ఫక్కున నవ్వారు. లత నవ్వుతూ టిక్కెట్లు తెచ్చి యిచ్చింది.

''తెచ్చి యిచ్చావ్...'' కోపంగా అడుగుతున్న మాధవిని చూసి లత, మాధవ్ నవ్వారు. అతను వెళ్ళాక—'' నీ లవరా...'' వెటకారంగా అడిగింది.

''ఛ...వూరుకో...మా కజిన్. క్రొత్తగా యీ వూరికి వచ్చాడు...

''అయితే, ఆ కూత ముందే కూయచ్చుగా...''

''నీ కోపతాపాలు మా బ్రదర్ చూడాలనీ...'' వెక్కిరింతగా అంది లత. థియేటర్‌లో వాళ్ళ వెనుకే చేరారు మాధవ్ ఫ్రెండ్స్. ముక్కుమీద కోపం ఆడవాళ్ళకు చాలా అందం తెస్తుంది సుమా!... కావాలనే అంటున్నాడొకతను.

''ఊరుకో!... యూ ఆర్ మేరీడ్, లేడీస్‌ని కామెంట్ చేసే హక్కు లేదు'' అన్నాడు మాధవ్.

''అఫ్ కోర్స్! కానీ మా మరదలు కదా బ్రదర్...'' ఇవన్నీ వింటూ లత నవ్వటం మాధవికి కోపం పెరిగిపోవటం జరుగుతున్నది.

* * *

మరుసటిరోజు రోడ్డు వైపు మేడమీద బాల్కనీలో నిల్చున్న మాధవి మాధవ్‌ను చూడగానే ఆశ్చర్య పోయింది. అయితే యీ వీధిలోనే చేరాడన్న మాట! అనుకుంది కానీ, అలా అలా చూసుకుంటున్న వారిద్దరి మధ్య మెల్లిమెల్లిగా తెలియని ఆకర్షణ, ఆత్మీయత కలిగాయి. లత పుణ్యమా అని స్నేహితులకు, ఆ వీధిలో వారికి తెలిసి అందరూ వీళ్ళ పెళ్ళి ఎప్పుడా అన్నట్టు చూడసాగారు. మాధవ్ ఆ వీథిలో పెద్ద వారికి బాగా నచ్చాడు.

ఇంట్లో తెలిసిన మాధవి నాన్నగారు ఒప్పుకో లేదు. ''నీకు మేనరికం వుంది. పైగా బావ ఇంజనీరు— ఆ సంబంధమే నీకు సెటిల్ చేస్తాన''ని మొండిగా వున్నాడు. అన్నా, వదిన కూడా తనకు అండ లేరు. మాధవి బాగా దిగులు పడిపోయింది.

* * *

స్నేహితుడి కుమారుడి పెళ్లికని పొద్దున్న ఏడు గంటలకు వెళ్ళారు మాధవి అమ్మా, నాన్నా. తొమ్మిదింటికి వస్తారేమో ననుకుంది వాచీ చూసుకుంటూ. ఆదివారం...కాలేజీ లేదు. బాల్కనీ వైపు వచ్చింది. ఆ వీథంతా బాగా వున్న రైతాంగం ముందు అరుగుమీద కూర్చుని బాతాఖానీ కొడుతున్నారు. పొలాల్లో పని లేదేమో! తీరిగ్గా రాజకీయాలలోకి దిగిపోయారు. వాళ్ళని చూసి లోపలికెళ్ళి పళ్లెం నిండా బియ్యం పోసుకొని ఏరసాగింది. టైము చూసింది. తొమ్మిదికి పది నిమిషాలు తక్కువ. వదిన ఇంట్లో పనిలో వుంది. రోడ్డు వైపు చూసింది. మాధవ్ మెల్లగా నడుస్తూ వస్తున్నాడు. ఎప్పటిలా గబగబ లోపలికి వెళ్లలేదు. అతన్నే చూడసాగింది—అతను ఆమె నిల్చున్న దగ్గరకు వచ్చాడు. అంతే — సడన్‌గా అతని మీదకి పైనుండి బియ్యం పొయ్యసాగింది. బిత్తరపోయి నిలబడిపోయాడు. ఆ వీధి పెద్దవాళ్ళు ఆ దృశ్యం చూస్తూ చప్పట్లు కొట్టారు. హడావిడికి లోపలున్న పెద్ద, చిన్న అందరు వచ్చేశారు. అదే సమయంలో రిక్షా దిగిన మాధవి నాన్నగారికి ఒళ్లు మండిపోయింది. కోపంగా ఏదో అనబోతున్న అతన్ని- 'చూడండీ మీరు ఆఫీసర్— ఆ హోదా ఆఫీస్ వరకే! ఇంటి దగ్గర పిల్లల దగ్గర ఆప్యాయత, ప్రేమ చూపాలి...ఈడూ జోడుగా వున్నారు. వారిద్దరికి పెళ్లి చెయ్యండి. కలకాలం చిలకా గోరింకల్లా వుంటారు. అయినా అలా చేయమని సలహా ఎవరిచ్చారో—మాధవమ్మ బాగా చేసింది...' అన్నారు వాళ్ళు. ''ఏం బాగుం టుంది—ఎవరన్నా చూస్తే...'' అంటున్న మాధవి అమ్మను చూసి, ఈ రోజుల్లో ఏమిటమ్మా? శోభనం జరిగిన తరవాత తాళి కట్టించుకోవటం ఫ్యాషనయింది. మన మాధవమ్మే నయం...తలం బ్రాలే పోసింది...'' అని నవ్వుతున్న వాళ్ళందరిని చూసి మాధవి సిగ్గుతో పారిపోయింది.

''ప్రేమ ఫలిస్తుందో లేదోనన్న ఆలోచనలతో సతమతమవుతూ తనకు ఏదో తోచి చేసిన యీ చిన్న పనికి దేవుడు అందర్ని తలంబ్రాలుగా భావించ మని, తనకు పెళ్లి జరిగే వరం ప్రసాదించాడనుకుంది మాధవి మనసులో సంతృప్తిగా.

—డి. కుసుమ కుమారి